మలేరియా రహిత సమాజమే లక్ష్యం

చింతలపూడి: మలేరియా రహిత సమాజమే లక్ష్యంగా పారామెడికల్ సిబ్బంది పని చేయాలని యర్రగుంటపల్లి పీహెచ్‌సీ సబ్ యూనిట్ అధికారి ఎస్‌పీ ప్రసాద్ సూచించారు. మలేరియా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో చింతంపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమం, ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మలేరియా దోమ కాటువల్ల వస్తుందని, ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమకాటుకు గురికాకుండ ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలని అన్నారు. సిబ్బంది క్షేత్ర స్థాయిలో దోమల నియంత్రణ, మలేరియా వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. చలితో జ్వరం వస్తే మలేరియాగా అనుమానించాల్సి వస్తుందని, తక్షణం వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, నీటి తొట్టిలపై మూతలు వేసుకోవాలని అన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూసీ సీహెచ్‌ఓ శ్రీనివాసరావు, హెల్త్ అసిస్టెంట్ రాజారావు ,శంకర్, ఏఎన్‌ఎం రాజేశ్వరి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనపై అవగాహన

కొయ్యలగూడెం: మలేరియా మాసోత్సవాన్ని పురస్కరించుకొని సరిపల్లి ఆరోగ్య ఉపకేంద్రంలో మలేరియా వ్యాధి నిర్మూలన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని, తగు నివారణ చర్యలు తీసుకోవటం ద్వారా మలేరియా, డెంగీ నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. దోమలు కుట్టకుండా జాగ్రత్త పడాలని, నీరు నిల్వ ఉంటే దోమలు గుడ్లు పెట్టి, అభివృద్ధి చెందుతాయని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. పరిసరాలు, పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి ఆవరణలో పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, డిస్పోజిబుల్ గ్లాసులు పాత కుండలు తొలగించుకోవాలని అన్నారు. డ్రెయిన్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే దోమల వృద్ధిని అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్‌కే చాన్‌బాషా, హెల్త్ అసిస్టెంట్ ఎం సుబ్బారావు, ఎంఎల్‌హెచ్‌పీ ఎం విమల, ఏఎన్‌ఎంలు పి.జయప్రద, కె.గంగాదేవి, ఆశా కార్యకర్తలు కె.వెంకటలక్ష్మి, ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.



చింతలపూడి : చింతంపల్లిలో మలేరియాపై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


కొయ్యలగూడెం : మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం


కొయ్యలగూడెం : సరిపల్లిలో ర్యాలీ

ముగిసిన వేసవి శిక్షణా తరగతులు

పోలవరం రూరల్: పోలవరం శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు మే 15వ తేదీన చేపట్టిన వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. కథల పుస్తకాలు చదివి చెప్పడం, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలు, డ్రాయింగ్ వేయడం, విద్యార్థుల ప్రతిభను బట్టి వారికి అవసరమైన పుస్తకాలు అందించి చదివించామని గ్రంథాలయ సహాయకులు జె.సుబ్రహ్మణ్యం తెలిపారు. విద్యార్థులు నిత్యం గ్రంథాలయానికి వచ్చి కొంత సమయం వివిధ పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని అన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశామని సుబ్రహ్మణ్యం తెలిపారు.

ధర్మాజీగూడెం శాఖ గ్రంథాలయంలో..

లింగపాలెం: ధర్మాజీగూడెం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా గ్రంథాలయ కమిటీ సభ్యులు బీఎస్‌వీఎస్ ప్రకాష్‌రావు, కందుల చిట్టియ్య, బాల వెంకట సుబ్బారావు పాల్గొన్నారు. తొలుత గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి విద్యార్థీ వీలున్నప్పుడల్లా గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అతిథులు సూచించారు. ఈ తరగతులకు హాజరైన ప్రతి విద్యార్థికి ప్రశంసా పత్రం, ప్రోత్సాహక బహుమతులు, డ్రాయింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ తయారు చేసిన పిల్లలకు కూడా ప్రత్యేక బహుమతులు అందించారు. తొలుత విద్యార్థులు వేసవి శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న నీతి పద్యాలు, జీకే, ఇతర అనేక విషయాలను అతిథుల ముందు వల్లె వేశారు. కార్యక్రమంలో 25 మంది విద్యార్థులు, రిసోర్స్ పర్సన్ ఎం జ్యోతి ప్రియాంక, ఏవీ నారాయణ, గ్రంథాలయాధికారి తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల గ్రంథాలయంలో..

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం శుక్రవారంతో ముగిసింది. గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప ఆధ్వర్యంలో ఉదయం ముగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. 24 రోజుల పాటు జరిగిన ఈ శిబిరంలో విద్యార్థులు పుస్తక పఠనం చేసి సమీక్షలు రాయడం, కథలు పుస్తకాలు చదివి చెప్పడం, స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రలు, వారు చేసిన సేవలు, త్యాగం గుర్తించడం, డ్రాయింగ్, పాటలు పాడడం, కాగితాలతో బొమ్మలు చేయడం, యోగసానలు తదితర అంశాల్లో జ్ఞానాన్ని పొందినట్టు పాప తెలిపారు. ప్రతి రోజు శిక్షణా శిబిరంలో పాల్గొని బహుమతులు సాధించిన విద్యార్థులను ఆమె అభినందించి, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి, పాఠకులు పాల్గొన్నారు.


పోలవరం : విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం


పోలవరం : పుస్తకాలపై అవగాహన కల్పిస్తున్న సుబ్రహ్మణ్యం


లింగపాలెం: విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కమిటీ సభ్యులు


ద్వారకాతిరుమల : విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న గుర్రం బంగారు పాప

రజత వస్త్రానికి వెండి సమర్పణ


విశేష అలంకరణలో నూకాలమ్మవారు


రజత వస్త్రానికి వెండి సమర్పిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మవారిని శుక్రవారం సందర్భంగా విశేషంగా అలంకరించి, పూజలు చేశారు. ఆలయ కల్యాణ కళావేదిక వద్ద ఉత్సవమూర్తికి పంచామృతాలు, పుణ్య నదీ జలాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. మూల విరాట్‌కు ఏకాదశ హారతి పూజలు, వేదదర్బారు సేవ, చతుర్వేద స్వస్తి, నీరాజన మంత్ర పుష్పం, సాయం సంధ్యా హారతి పూజలు ప్రధాన అర్చకుడు మనోజ్ శర్మ చేశారు. ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారి వెండి చీర తయారీకి పోలుపర్తి నాగవేణుమాధవి దంపతులు రూ.5,116 విలువ గల వెండి, అత్తిలికి చెందిన నగిరెడ్డి సూర్య నారాయణ, వెంకటలక్ష్మి దంపతులు 5తులాల వెండి, కొరసా పోతురాజు సుధా దంపతులు రూ.5,116, గోలి విజయకుమార్ మంగతాయారు దంపతులు రూ.5,116 అమ్మవారి వెండి చీర నిమిత్తం విరాళాలు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

కుక్కునూరు: పోడు భూములకు పట్టాలివ్వాలని జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్‌కే గౌస్ అన్నారు. మండలంలోని దామచర్ల గ్రామంలో కొండా శ్రీను అధ్యక్షతన మాస్ లైన్ ప్రజా పంథా కుకునూరు మండల కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో గౌస్ మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా ఆదివాసి గిరిజనులు, ఇతర పేదలు పోడు వ్యవసాయంపై ఆధార పడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. పోడు సాగుదారులకు 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో అనేక పోరాటాలు చేసి జిల్లా అధికారులకు సైతం వినతిపత్రాలు అందజేసినా నేటి వరకు పట్టాలు అందలేదన్నారు. పోడుదారులపై ఫారెస్ట్ అధికారుల దాడులు, నిర్బంధాలు, బెదిరింపులు, గొడ్ల పాకలు తగుల పెట్టి భయ భ్రాంతులకుగురి చేస్తు, కేసులు పెట్టి జైళ్లకు పంపిస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం ఆదివాసీలకు పోడు పట్టాలు ఇప్పించాలని, పోడుదారులపై ఫారెస్ట్ అధికారుల బెదిరింపులు దాడులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ ప్రజా పంథా జిల్లా, డివిజన్, మండల నాయకులు బి.సత్యనారాయణ, కంగాల కల్లయ్య, కొండా ప్రసాదు, మచ్చ లక్ష్మయ్య, కొండ శ్రీను, బి.పున్నమయ్య, ఎం .ముత్తమ్మ, పీవోడబ్ల్యూ డివిజన్ సహాయ కార్యదర్శి ఎస్‌కే మున్ని పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్కే గౌస్

హోంగార్డుకు ఎస్పీ సత్కారం

ఏలూరు (టూటౌన్): పదవీ విరమణ చేసిన హోంగార్డు వి.కృష్ణ గణేష్‌ను ఎస్పీ డి.మేరీ ప్రశాంతి సత్కరించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా హోంగార్డుకు శాలువా కప్పి, మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ పదవీ విరమణచేసిన కృష్ణ గణేష్ పోలీస్ శాఖలో కార్పెంటర్‌గా పనిచేస్తూ అనేక అంశాల్లో తన ప్రతిభాపాటవాలను ప్రదర్శించిన నేపథ్యాన్ని గుర్తుచేశారు. ఆయన సేవలను కొనియాడారు. హోంగార్డు 83 కృష్ణ గణేష్‌కి శాఖాపరమైన విషయాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని ఎస్పీ మేరీ ప్రశాంతి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఏఆర్ ఆర్ఐ పవన్ కుమార్, ఆర్‌ఎస్ఐ భాస్కర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమర్ ఆలీ మృతికి సంతాపం


ఉమర్ ఆలీకి నివాళులర్పిస్తున్న ఇఫ్టూ నాయకులు

జంగారెడ్డిగూడెం: ఉమర్ అలీ మాస్టర్ మరణం పేద వర్గాలకు తీవ్రలోటని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ అన్నారు. శుక్రవారం జంగారెడ్డిగూడెం ధర్మన్న స్మారక భవనంలో జంగారెడ్డిగూడెం ఫొటో అండ్ వీడియో మిక్సింగ్ యూనియన్ ఇఫ్టూ అనుబంధం ఆధ్వర్యంలో మహమ్మద్ ఉమర్ అలీ సంతాప సభ వై.సూరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో రమణ, ఫొటో అండ్ వీడియో మిక్సింగ్ యూనియన్ అధ్యక్షుడు కానుమూరి సోమరాజులు మాట్లాడారు. ఉమర్ అలీ గత ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారని, ఆయన తన జీతంలో 40 శాతం కేటాయించి పేదలకు అనేక సేవలు చేసే వారని, పేద విద్యార్థులకు దస్తులు, పుస్తకాలు కొని ఇచ్చేవారని, 40 కుటుంబాలకు పైగా పింఛన్‌గా కొంత సొమ్ము ఇచ్చేవారని గుర్తుచేశారు. ఆలీ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి, ఆయన కుటుంబానికి సంతాపం వ్యక్తం చేశారు. బాలు, జయ చండేశ్వరరావు, కాగితాల శ్రీను, వెంకట్, లామినేషన్ శ్రీను, కామవరపుకోట శ్రీను, రమణారావు, జగన్, పద్మార్, నవీన్, నరేష్, ప్రసాద్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బాలరాజుకు అభినందనలు


ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, కరాటం రాంబాబులను అభినందిస్తున్న నాయకులు


ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌ను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

కొయ్యలగూడెం: పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకి, అందుకు కారణమైన డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబులను కొయ్యలగూడెం మండల జనసేన పార్టీ నాయకులు అభినందించారు. శుక్రవారం బయ్యన్నగూడెం, గవరవరం గ్రామ జనసేన నాయకులు ఎస్‌ఆర్‌ఆర్ నరసింహారాజు, మద్దు తేజ, అమిరిశెట్టి దిలీప్‌ల నేతృత్వంలో పలువురు నాయకులు ఇరువురు నాయకులను కలుసుకుని పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కొయ్యలగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్, ఆర్య వైశ్య సంఘం నాయకులు ఎమ్మెల్యే బాలరాజును కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే రోషన్‌ను కలిసిన నాయకులు

జంగారెడ్డిగూడెం: చింతలపూడి ఎమ్మెలే రోషన్‌కుమార్‌కు జంగారెడ్డిగూడెం టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. శుక్రవారం రోషన్ కుమార్ నివాసంలో ఆయన్ని మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్ప గుచ్చం అందించి దుశ్శాలువా సత్కరించారు. వీరిలో చెరుకూరి శ్రీధర్, కొండ్రెడ్డి కిషోర్, కోనేటి చంటి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు జంగారెడ్డిగూడెం ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో ఎంపీడీఓ కె.ప్రసాద్, సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు కృషి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహిళా సాధికారతకు లయన్స్‌క్లబ్ కృషి చేస్తుందని లయన్స్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. ఏలూరు విజన్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వివిధసేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. కండ్రికగూడెంలో మొక్కలు పంపిణీ చేశారు. గన్‌బజారులోని 25 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు.

యువకుల రక్తదానం


రక్తదానం చేస్తున్న జాషువా, తన స్నేహితులను అభినందిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): రక్త దానం చేసి మరొకరికి ప్రాణదాతలు కావాలని జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ టీవీ కృష్ణారెడ్డి పిలుపు నిచ్చారు. ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సెంటర్‌లో శుక్రవారం 27 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సంధర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా బాధిత చిన్నారులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో కె.జాషువా అనే యువకుడు రక్తదానం చేసేలా తన స్నేహితులను ప్రోత్సహించినందుకు ఆయన జాషువాకు అభినందనలు తెలిపారు. ప్రతి నెలా తలసేమియా బాధిత చిన్నారులకు రక్త మార్పిడి కార్యక్రమాన్ని రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆర్‌ఎస్‌ఆర్‌కే వరప్రసాదరావు, జి.స్పందన, పీఆర్‌ఓ కేవీ రమణ, జాషువా పాల్గొన్నారు.

క్లుప్తంగా

వేగంగా విద్యుత్ పనులు


విద్యుత్ పునరుద్ధరణ పనులు పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

పోలవరం రూరల్: విద్యుత్ లైన్‌ల పునరుద్ధరణ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నట్టు డీఈ పి.రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన పోలవరం గ్రామంలో రెవెన్యూ కార్యాలయానికి వెళ్లే రోడ్డు మార్గంలో విరిగిపడిన విద్యుత్ స్తంభాలను పునుద్ధరించే పనులను పరిశీలించారు. గత రెండు రోజుల క్రితం పోలవరంలో వీచిన ఈదురుగాలులు, వర్షం ప్రభావానికి విద్యుత్ స్తంభాలు విరిగి, వైర్లు తెగిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ ఏఈ కె.సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్‌లైన్లను పునరుద్ధరిస్తున్నారు. విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించారు. మండలంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తిచేస్తున్నామని రాధాకృష్ణ తెలిపారు.

భూదేవి పండుగ ప్రారంభం


తంగెళ్లగూడెం వద్ద సంప్రదాయ నృత్యం చేస్తున్న గిరిజనులు

కొయ్యలగూడెం: తొలకరి జల్లుల పులకరింపుతో భూమాతను కొలిచే వేడుకలు గిరిజన, గిరిజనేతర గ్రామాల్లో ప్రారంభమయ్యాయి. శుక్రవారం దిప్పకాయలపాడు సమీపంలోని తంగెళ్లగూడెం గ్రామం వద్ద గిరిజన గ్రామస్తులు సంప్రదాయ నృత్యాలతో భూమాతను కొలుస్తూ వేడుకలు నిర్వహించారు. రైతుల వద్ద నుంచి పసుపు, కుంకుమల రూపంలో చందాలు స్వీకరిస్తూ కార్యక్రమాలు చేపట్టారు. గిరిజన పెద్దల చేతుల మీదుగా వరి నారుమడులకు విత్తనాలను తీసుకుని వ్యవసాయ క్షేత్రాల్లో చల్లుకోవడం ప్రారంభించారు. సుమారు 15 రోజులపాటు ఈ వేడుకలు నిర్వహించడం ఏజెన్సీ ప్రాంతంలో ఆనవాయితీగా వస్తుంది.

శ్రీవారి సేవలో ఏలూరు అడిషనల్ ఎస్పీ


ఏఎస్పీ స్వరూపారాణి

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రాన్ని ఏలూరు అడిషనల్ ఎస్పీ జి.స్వరూపారాణి శుక్రవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆమె ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనం పొందారు.

ఎమ్మెల్యే మద్దిపాటి విజయోత్సవ ర్యాలీ


ఎమ్మెల్యే మద్దిపాటికి స్వామివారి జ్ఞాపిక అందిస్తున్న ఆలయ ఈఓ త్రినాథరావు

ద్వారకాతిరుమల: గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు శుక్రవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఆయన పార్టీ నేతలతో కలిసి ద్వారకాతిరుమల చినవెంకన్నను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు శ్రీవారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం పంగిడిగూడెం నుంచి సూర్యచంద్రరావుపేట, గొల్లగూడెం, తిమ్మాపురం, రామన్నగూడెం, వెంకటకృష్ణాపురం, గుండుగొలనుకుంట, ద్వారకాతిరుమల, దొరసానిపాడు, సీహెచ్ పోతేపల్లి, జి.కొత్తపల్లి, లక్ష్మీపురం, ఐఎస్ రాఘవాపురం మీదుగా పలు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి మద్దిపాటి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలి

ఏలూరు (టూటౌన్): రైతులకు, కౌలు రైతులకు ధాన్యం బకాయి సొమ్ములు తక్షణం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. ఏలూరు శివారు సుంకరవారి తోటలో నిర్వహించిన ధాన్యం బకాయి సొమ్ములు రావాల్సిన బాధిత రైతుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రైతులు, కౌలురైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మి 40 రోజులు దాటిపోతున్నా ధాన్యం బకాయి సొమ్ములు చెల్లించకపోవడం వల్ల అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రబీ సాగుకు చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని చెప్పారు. ఏలూరు జిల్లా పరిధిలో సుమారు రూ.200 కోట్లు ధాన్యం సొమ్ములు రైతులకు చెల్లించాల్సి ఉందని తెలిపారు. బైరెడ్డి లక్ష్మణరావు,ఎస్ నాగరాజు, ధర్మవరపు రాము పాల్గొన్నారు.

విజిబుల్ పోలీసింగ్


జంగారెడ్డిగూడెంలో వాహనాల తనిఖీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తున్నట్టు సీఐ పి.రాజేష్, ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు. జంగారెడ్డిగూడెంలో శుక్రవారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో వాహన తనిఖీలు చేశారు. వాహనదారులకు వాహన నిబంధనలు వివరించారు. శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఆయా గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఫలితాలు అనంతరం భావోద్వేగాలు ఎక్కువగా ఉండే నేపథ్యంలో శాంతిభద్రతల నెలకొల్పే దృష్ట్యా కొన్ని రోజుల పాటు వేగవరం, శ్రీనివాసపురం, పేరంపేట, పంగిడిగూడెం తదితర గ్రామాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించటం అభినందనీయం


ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

కామవరపుకోట: ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా ప్రోత్సహించడం అభినందనీయమని ఎంఈఓలు డి.సుబ్బారావు, సీహెచ్ ప్రశాంత్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలో మండలంలోని ఏడు పాఠశాలలో పదో తరగతి చదివి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన 13 మంది విద్యార్థులకు సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ మెంబర్ 93 రామన్నపాలెం గ్రామ నివాసి చైనాలో ఉండే బోడా విజయ్ ఆర్థిక సాయంతో ప్రశంసా పత్రం, పారితోషకం, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో రావికంపాడు ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు, ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, పోరంకి నాగరాజు, శివ ప్రసాద్, కిషోర్, ఎస్ ప్రసాదు, ఎం సుబ్బారావు, సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు వీరమల్ల మధు, మున్నంగి శ్రీనివాస్ (కరివేపాకు), గోరీకల వెంకట్, సాజన్ సాయి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.